


ఆంగ్లమూలం: ఎన్.ఆర్.కె.
అనువాదం: కొల్లూరి సోమశంకర్

# ఇజంలో ఇంప్రిజన్

చిన్న తుంపర పడుతోంది. వాళ్లిద్దరూ చేతిలో చెయ్యేసుకుని, ఒకరి సాహచర్యాన్ని మరొకరు ఆస్వాదిస్తూ నడవడం రాజు చూశాడు. ఆ యువకుడు ఖరీదైన లెదర్-జాకెట్, ఫాషన్ కోసం మోకాళ్ల దగ్గర చింపిన జీన్సు పాంటు వేసుకున్నాడు.

'ఎంత డబ్బుండీ ఏం లాభం, చిరిగిన బట్టలు వేసుకుంటే...' అనుకున్నాడు రాజు. తన బట్టలకేసి చూసుకున్నాడు. అక్కడక్కడ చిరుగులు ఉన్నా, అవి మాసికలు వేసున్నాయి.

ఆ యువతి కూడా జీన్సు వేసుకుంది. అదీ మోకాళ్లకి కొంచెం కిందవరకే. ఆమె కాలి పిక్కలు ఆరోగ్యంగా కనిపిస్తున్నాయి.

'ఆహా, ఎంత అందమైన కాళ్లు! ఇంకొంచెం స్పష్టంగా భలే ఉంటుంది...' అనుకున్నాడు రాజు. చివరికి అతని ఆలోచనలు మళ్లీ తన వ్యాపారం మీదకి మళ్లాయి. 'వాళ్లు మొక్కజొన్న కండెలు కొంటే బాగుండు...'

రాజు పదిహేనేళ్ల కుర్రాడు. ఏడాదిలో కాలానికి తగ్గట్టుగా రకరకాల వస్తువులని, మెరీన్ డ్రైవ్‌లో సిమెంటు కాలిబాటపై అమ్ముతుంటాడు. వేసవిలో మంచినీళ్ల బాటిళ్లు, కుల్ఫీ, వానకాలంలో మొక్కజొన్న పొత్తులు, చలి కాలంలో వేడివేడి టీ అమ్ముతాడు. పగటి పూట వ్యాపారం చేసుకుంటూ, సాయంత్రం పూట మునిసిపాలిటీ వాళ్లు నడిపే బడిలో చదువుకుంటున్నాడు. రాజు వాళ్ల నాన్న ఉద్యోగం ఊడడంతో, రాజు బడి మారాల్సివచ్చింది. కొడుకుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడాయన. కానీ ఉద్యోగం పోవడంతో నిస్పృహకి గురై, తాగుడుకి బానిసయ్యాడు. రాజు కూడా భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్నాడు. అయితే ఆ కలలన్నీ రాత్రి పూట బడిలో కునుకు తీస్తూ కన్నవే. అందువల్ల అవి నిజం కాలేదు.

ఆ జంట కూడా నడుస్తూ, రాజుని, అతడి మొక్కజొన్న కండెల సరంజామాని చూశారు. వేడివేడి మొక్కజొన్న పొత్తులు కనపడగానే ఆ యువతికి నోరూరింది. 'ఎర్రని మసాలాతో నంచుకుని తింటే పొత్తులు ఎంత బావుంటాయో' అనుకుంది. ఇంతలో ఆమెకి 'వాన కాలంలో బయట ఏదీ తినద్దు. రోగాలొస్తాయి' అని వాళ్లమ్మ చెప్పిన మాటలు గుర్తొస్తాయి. అబ్బా కొంతమంది డాక్టర్లు, ఇళ్లకి వచ్చినా కూడా తమ వృత్తిని మరిచిపోరు కదా! 'అమ్మా, నాన్నా, మీరు ఓ ఆసుపత్రిని చక్కగా నడుపుతున్నారని నాకు తెలుసు. నగరంలో మీకెంతో పేరు ప్రతిష్ఠలున్నాయని కూడా తెలుసు. కానీ నేను తెగ సంపాదించి అరగక మీ దగ్గరకొచ్చే పేషెంటుని కాదు. మీ కూతురిని. నా జీవితాన్ని నన్ను గడపనీయండి...' అనుకుంది. మొక్కజొన్న పొత్తులని చూస్తూ పెదాలని నాలికతో తడుపుకుంది. తల్లి విధించిన ఆహారనిషేధాజ్ఞలను ఉల్లంఘించాలనే కోరికా, మొక్కజొన్న కండెల వాసనా ఆమెని నిలవనీయలేదు.

రాజు కూడా ఎవరూ చూడకుండా తన పెదాలను తడుపుకున్నాడు. ఆమె తన మొక్కజొన్న పొత్తుల వైపే చూడడం గమనించాడు. 'కాసేపట్లో వాళ్లిద్దరూ నా కొట్టుకి రావడం ఖాయం' అని అనుకున్నాడు. జంటలకి అమ్మడం తేలిక! ఎంత ధర చెప్పినా అబ్బాయిలు బేరమాడరు. అదీ, తాము ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న అమ్మాయిల ముందు అస్సలు బేరాలాడరు. రిటైరైపోయి, ఎవరినీ ఆకట్టుకోవలసిన అవసరం లేని ముసలాళ్లే గీచిగీచి బేరాలాడుతారు. వాళ్ల పింఛనుని, ఆస్తులని రాసిస్తున్నట్లే భావిస్తారు. నిప్పులని మరోసారి రాజేసి "వేడి వేడి

మొక్కజొన్న కండెలు! మసాలా మొక్కజొన్న కండెలు!" అంటూ గట్టిగా అరిచాడు.

'వెధవ! వీడిప్పుడు నన్ను బుట్టలో వేయాలని చూస్తున్నాడు. కానీ నేను తనని కాదనలేని పరిస్థితి, లేదంటే నా తాయిలం నాకు దక్కదు. ఏం చేస్తాం? నాకీ పూట ఉప్పటి పెదాలే గతి...' అనుకుంటూ నిట్టూర్చాడు యువకుడు.

"నాకు వానలంటే ఎంతో ఇష్టం! చిటచిట చినుకుల చప్పుడు, తడిసిన మట్టివాసన, వేసవి చెమట నుంచి ఉపశమనం. వెన్నతో మొక్కజొన్న పొత్తులు తినడం, వేడి వేడి టీతో పాటు పకోడీలు తినడం., సముద్రపు అలలు మనల్ని తడుపుతుంటే ఇలా మెరీన్ డ్రైవ్‌లో నడవడం... ఓహ్! ఎంత బావుంటుందో..." ఉత్సాహంగా చెప్పిందామె, తన ప్రియుడితో, రాజు కొట్టుని సమీపిస్తూ.

000

'నాకు వానలంటే అసహ్యం! తరగతిగదిలో రేకులు కారతాయి. ఇంటి పక్క మురికి కాలవ పొంగి పొర్లుతోంది. పైగా మునిసిపాలిటీ వాళ్లు వచ్చేవారం మా మురికివాడని కూల్చేస్తారట! నా మూడు జతల బట్టలూ తడిసే ఉన్నాయి. వాటిని వేసుకుంటే వచ్చే ఆ ముతక వాసనని భరించడం కష్టం...' అనుకున్నాడు రాజు.

వాళ్లిద్దరూ మొక్కజొన్న పొత్తులు కొనుక్కొని తింటూ, తమ కార్లోకి దూకి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత సేపటి తర్వాత, ఓ బాన పొట్ట పోలీసు వచ్చి, రాజుని అక్కడి నుంచి తరిమాడు.

'వీళ్లు వసూలు చేసినదంతా పొట్టలోకే వెడుతుంది కాబోలు' అనుకుంటూ కదిలాడు రాజు. రెండేళ్లు గడిచిపోయాయి. చక్కటి మార్కులతో పాసయ్యాడు రాజు. మునిసిపల్ స్కూల్ చదువు ముగిసింది. స్కాలర్‌షిప్ లభించడంతో, కామర్సు కోర్సులో చేరాడు.

ఓ సాయంత్రం పూట ఎకనామిక్స్ క్లాసు జరుగుతోంది. రాజు జోగుతున్నాడు (క్లాసులో కునికిపాట్లు పడే ఈ పాత అలవాటింకా పోలేదు). లెక్చరర్ పెట్టుబడిదారీ విధానం గురించి చెబుతున్నాడు- "పెట్టుబడి వ్యవస్థ అంటే ప్రభుత్వం స్వేచ్ఛావాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుందన్నమాట. అంటే అన్నింటినీ మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయి. వర్తకవాణిజ్యాలలో ప్రభుత్వప్రమేయం ఉండదు..."

'కానీ మా నాన్న ఉద్యోగం పోడానికి, పచ్చి తాగుబోతుగా మారడానికి ఈ పెట్టుబడిదారీ వ్యవస్థే కారణం. నాన్న పనిచేసే ప్రభుత్వరంగసంస్థ ప్రైవేటు పరమవడం, కొత్త యజమానులు ఉద్యోగాల్లో కోత విధించి, ఉద్యోగులపై వేటు వేయడం, ఫీజులు కట్టలేని కారణంగా నేను ప్రైవేటు స్కూలు నుంచి మునిసిపల్ స్కూలు మారడం-ఇవన్నీ పెట్టుబడిదారీ విధానం వలనే కదూ?' గుర్తుచేసుకున్నాడు రాజు.

"ఒక దేశం తన శక్తిసామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా కాపిటలిజం తోడ్పడుతుంది. సంపదను అన్ని సార్లూ సమానంగా పంచకపోయినా, ధనవంతులు కూడబెట్టిన ధనంతో సమాజంలోని కింది వర్గాలకు ఉపాధి అవకాశాలను కల్పించే స్వభావం కలిగి ఉంటుంది. దీన్నే ట్రికిల్-డౌన్ ఎఫెక్ట్ అని అంటారు..." అంటూ ఇంకా చెబుతున్నాడు లెక్చరర్.

'క్రిందకి చేరడం... ట్రికిలింగ్ డౌన్... హుం! పెట్టుబడిదారీ విధానం, వానలు-రెండూ ఒకలాంటివే! వాటి ధాటి నుంచి రక్షణ ఉన్నవాళ్లు వాటిని ఎంతో ఇష్టం. మరి రక్షణ లేని వాళ్లో? గూడు లేని వాళ్లు వానలని తిట్టుకుంటారు. ఉద్యోగాలు, కార్లు, రకరకాల వస్తువులు కొనడానికి షాపింగ్ మాల్ ఉన్నవాళ్లకి, పెట్టుబడిదారీ విధానం నచ్చుతుంది. ఉద్యోగాల్లో కోత విధించి, తమని నిరుద్యోగులుగా మార్చినందుకు మరి కొందరు పెట్టుబడిదారీ విధానాన్ని అసహ్యించుకుంటారు...' మనసులో విశ్లేషించుకున్నాడు రాజు.

ఇంతలో ఆమెకి 'వాన కాలంలో బయట ఏదీ తినద్దు. రోగాలొస్తాయి' అని వాళ్లమ్మ చెప్పిన మాటలు గుర్తొస్తాయి. అబ్బా కొంతమంది డాక్టర్లు, ఇళ్లకి వచ్చినా కూడా తమ వృత్తిని మరిచిపోరు కదా! 'అమ్మా, నాన్నా, మీరు ఓ ఆసుపత్రిని చక్కగా నడుపుతున్నారని నాకు తెలుసు. నగరంలో మీకెంతో పేరు ప్రతిష్ఠలున్నాయని కూడా తెలుసు. కానీ నేను తెగ సంపాదించి అరగక మీ దగ్గరకొచ్చే పేషెంటుని కాదు. మీ కూతురిని. నా జీవితాన్ని నన్ను గడపనీయండి...' అనుకుంది. మొక్కజొన్న పొత్తులని చూస్తూ పెదాలని నాలికతో తడుపుకుంది. తల్లి విధించిన ఆహారనిషేధాజ్ఞలను ఉల్లంఘించాలనే కోరికా, మొక్కజొన్న కండెల వాసనా ఆమెని నిలవనీయలేదు.

000

రాజు చదువులో బాగా రాణించాడు. ఇంకో స్కాలర్‌షిప్ దొరికింది. ఎం.బి.ఏ.లో చేరాడు. వీధి బాలల కోసం, మురికివాడల్లోని పేదల కోసం పని చేస్తానని తనకి తాను చెప్పుకున్నాడు.

కాంపస్ సెలక్షన్ల చివరి రోజున, రాజుకి రెండు అవకాశాలు వచ్చాయి. మొదటిది-జీతం పెద్దగా ఇవ్వలేని ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం. భారీ జీతం, పెద్ద బోనస్, అన్ని సౌకర్యాలు, నగరంలో విలాసవంతమైన చోట బస, కంపెనీ వాహనం.

రాజు రెండు అవకాశాలనూ బేరీజు వేసుకున్నాడు. ఇప్పటిదాకా గడిచిన తన జీవితాన్ని ఒకసారి పునశ్చరణ చేసుకున్నాడు. ఉద్యోగ నియామకపత్రంపై సంతకం చేశాడు.

000

రెండు నెలల తర్వాత, వర్షాలు ముంబయిని ముంచెత్తాయి. రాజు తన కారు అద్దాలని పైకెత్తాడు. చినుకులు అద్దం నుంచి కిందకి జారాయి. పక్కకి తిరిగి తన ప్రేయసిని ముద్దు పెట్టుకుని, "నాకు వానలంటే ఎంతో ఇష్టం!" అని చెప్పాడు.

ఓ క్షణంపాటు ఆలోచించి, 'నాకు కాపిటలిజమన్నా ఇష్టమే. ప్రభుత్వం నా చదువుకి సహకరించి, సాయంత్రం బడి నిర్వహించినంత కాలం, నేను సోషలిజాన్ని ఇష్టపడ్డాను. కానీ బహుళజాతి బ్యాంకు కల్పించే సౌకర్యాలు, ఏ ప్రభుత్వరంగ మైక్రో ఫైనాన్స్ సంస్థ కల్పించగలదు? నాకు మేలు చేసే ఏ ఇజమైనా నాకు ఓకే. నేను మానసికంగా కాపిటలిస్టును...' అనుకున్నాడు రాజు. ●